# సామాన్యునికి గుర్తింపు

గుర్తింపు కార్డుల కథ ఒక మహారామాయణమై పోయింది. జనవరి 1995 నుంచి గుర్తింపు కార్డులు లేనిదే ఎన్నికలు జరపనని శేషన్ ఇదివరలో ప్రకటించారు. అయినా ఎంత సమయమిచ్చినా రాష్ట్రాలు గుర్తింపు కార్డులు తయారీలో సమస్యలు చెబుతూనే వున్నాయి. గుర్తింపు కార్డులున్నా లేకపోయినా ఎన్నికలు జరపాలని సుప్రీంకోర్టు ఆదేశం కూడా ఇచ్చింది.

అసలు వోటరుకు ఎందుకీ గుర్తింపు కార్డు? ఒకరి పేరుమీద మరొకరు ఓటు వేయకుండా! గుర్తింపుకార్డు వుంటే అలా దొంగవోట్లు పడవా? ఇది ఆలోచించవలసిన విషయం వోట్లు వేయించేవారు. అధికార వర్గం. ఓట్లు 'బూతు' లో పల వేసేస్తే? అలాగే రిగ్గింగ్ జరిగి. ప్రజలపై జులుంచేసి వోట్లు గుద్దేస్తే? గుర్తింపు కార్డుల ఉనికి ఎవరికి కావలసి వస్తుంది?

మనిషి మోసం చేయాలనుకుంటే అనేక మార్గాలు. ప్రతీ చట్టానికి కొన్ని లొసుగులుంటాయి. అమలులో అనేక ఇబ్బందులు! గుర్తింపు కార్డులు ప్రతీ అయిదు సంవత్సరాలకు మారుస్తారా? మనిషి శరీరం ఓ సారి లావెక్కుతుంది. మరోసారి జబ్బు చేస్తే సన్నడిబపోతుంది. అప్పుడు గుర్తింపు కార్డులో ఫోటో పోలికలుండవుగా! అలాగే ఓ వ్యక్తి గెడ్డం పెంచితే. వేషంమారిస్తే ఆకారమే మారిపోతుందిగా! అధికారులు గుర్తు పట్టడం కష్టమైపోతుంది అటువంటి సమయాల్లో.

గుర్తింపుకార్డులు బహుళార్థక సాధకాలు కావాలని ప్రభుత్వం ఆలోచనకూడా- ఆ కార్డు బియ్యానికీ, కిరసనాయిలుకూ, వోటుకు, ప్రయాణానికి, ఇంకా ఎన్నో పనులకు ఒకే కార్డు సాధ్యమా? వీటన్నిటికి కార్డులోపల గళ్ళువుండాలి లేదా ఒక పాసు పుస్తకమైనా ఇవ్వాలి. మరి ఈ కార్డు పొందడానికి ప్రతి పౌరుడూ మరికొంత డబ్బుకట్టాలి. ఇంత కష్టపడి తెచ్చుకున్న కార్డు పర్సులో వుండగా ఎవరైనా దొంగిలిస్తే పౌరుడి అవస్థలు వర్ణనాతీతం. ఎన్ని తిప్పలు పడితే ఆ కార్డు మళ్లీ దొరుకుతుందీ?

కార్డు పోయిందంటే మేజిస్ట్రేట్ వద్ద అఫిడవిట్ కావాలంటారు లేదా మండల్ రెవిన్యూ ఆఫీసర్ సర్టిఫికేట్ ఇవ్వాలంటారు. మరి ఐడెంటిటీ కార్డుల్లో బోగస్ కార్డులు ఉండవా? దొంగ వోటర్లు ఎన్నికల వోట్ల జాబితాలో నమోదవుతున్నట్లుగా దొంగవోటర్ల కార్డులుకూడా అమలులోకి రావా?

అయినా మనకు స్వాతంత్ర్యం వచ్చి దాదాపు 48 సంవత్సరాలైంది. ఇన్ని సంవత్సరాలూ రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తింపు కార్డులు ఏర్పాటు చేయలేకపోవడం విచారకరం కాదా? సుప్రీంకోర్టు న్యాయపరంగా, చట్టపరంగా తీర్పు ఇవ్వగలరు. కానీ నైతిక బాధ్యతలు గురించి పరిశీలించలేదు సుప్రీంకోర్టు నిర్ణయం అర్థం రాష్ట్రాలు గుర్తింపుకార్డులు ఇవ్వడంలో ఇంకా జాప్యం చేయవచ్చునని ఉద్దేశం కాదు.

సామాన్యుడికి అన్నీ గుర్తింపులే కావాలి! అసామాన్యుడికి ఏమీ అక్కర్లేదు రేషన్‌కార్డు ఉన్నవాడికే అవస్థలు. కిరోసిన్, బియ్యం, అన్నీ కోటా ప్రకారం తెచ్చుకోవాలి. ధనికుడికి ఈ కార్డే అక్కర్లేదు. బజార్లో తనకు తోచిన రీతి సరుకు తెచ్చుకుంటాడు డబ్బు విసిరేసి.

సామాన్యుడు ప్రభుత్వ కార్యాలయానికి వెడితే అన్నీ ప్రశ్నలే. అన్నీ చట్టాలే. అవన్నీ అమలు పరిచేసరికి కాలం తీరిపోతుంది. పెన్షన్

కోసం నలుగురు వ్యక్తులు స్వయంగా ప్రభుత్వ కార్యాలయానికి వెడితే నువ్వు బతికున్నట్టుగా సర్టిఫికెట్ తెమ్మంటారు.

ఇది ఎంత హాస్యాస్పదం. ఎదురుగా బతికివున్న మనిషి వస్తే. గుర్తింపుకార్డు పోతే నువ్వు అని నిరూపించుకోమంటే సామాన్యుడికి మహా దురవస్థ! వోటు గుర్తింపుకార్డు ఒక్కటే అయితే పోతే బాధపడడు సరి కదా ఓటు వేయడు.

కానీ ఓటూలేక రేషనూ లేక- రెండూ కలిపితే సామాన్యుడి ధీనావస్థ అర్థం చేసుకోవడమే ఓ మహాసమస్య! ప్రభుత్వంలో వున్నవారు తమ పరిపాలన కొనసాగించుకోవడం కోసం ఎన్నో జిమ్మిక్కులు చేస్తారు. అటువంటి జమ్మిక్కుల్లో ఇదొకటి!

సామాన్యుడు స్వేచ్ఛగా హాయిగా ఏ ఒత్తిడులు, కట్టుబాట్లు లేకుండా ఎప్పుడు బతకగలడు. బజారులో కావలసింది హాయిగా కొనుక్కుని తినాలి. బజారులో కావాల్సిన వస్తువులన్నీ పుష్కలంగా దొరకాలి. ఎగుమతుల పేరుమీద ముఖ్యమైన తినుబండారాలు, ఇతర పండ్లు, కూరగాయలూ కూడా అదృశ్యమైతే సామాన్యుడికి బజారు ఒక మాయా బజారే!

ఉత్తమ ప్రజాస్వామ్య దేశాలలో సామాన్యుడికి సర్వహక్కులూ కరతలామలకంగా వుంటాయి. కానీ భారతదేశంలో సామాన్యుడి సర్వహక్కులు అధినేతల పరాధీనం. వారి ఇష్టాష్టాలనుబట్టి సామాన్యుడు ఆనందిస్తాడు లేదా దుఃఖిస్తాడు. ఈ స్థితి మారాలి సామాన్యుడి ప్రతిదిన జీవనంలో ప్రభుత్వం ఏ ఆంక్షలు విధించరాదు.

• •